

లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

## ఆలోచించండి.. మార్పును గమనించండి

**మంత్రి సబితాఇంద్రారెడ్డి .. ఉప్పల్ చైతన్యనగర్‌లో డబుల్‌బెడ్రూం ఇండ్ల పంపిణీ**

ఉప్పల్, అక్టోబర్ 5 : ఆత్మగౌరవంతో జీవించేలా పేద, మధ్యతరగతి ప్రజల కలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. పార్టీకి, కుల, మతాలకు సంబంధం లేకుండా పారదర్శకంగా డబుల్‌బెడ్రూం ఇండ్లు కేటాయించి, ఇచ్చారని చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గం హెచ్‌బీకాలనీ చైతన్యనగర్‌లో గురువారం మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం లేదన్నారు. ఆలోచించాలని.. మార్పును, అభివృద్ధిని గమనించాలని కోరారు. ఆడబిడ్డ ఆత్మగౌరవం కోసం ఎన్ని నిధులైన ఖర్చుస్తామని చెప్పిన ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్‌లో లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జడ్పీ మమత

## అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణ

- హోం మంత్రి మహమూద్ అలీ

కుత్బుల్లాపూర్/జీడిమెట్ల, అక్టోబర్ 5: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఢిల్లీలో అప్పటి ఆంధ్రాపాలకులు తమ ఆందోళనలను చూసి హేళన చేశారని, ఎంతో మంది బలిదానాలు..మరెన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తుంటే.. ఆంధ్రా పాలకులు శభాష్ అని చెప్పడం యావత్ తెలంగాణకే గర్వకారణామని హోం మంత్రి మహమూద్‌అలీ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ గ్రామంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజులతో కలిసి కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, కంటోన్మెంట్(సికింద్రాబాద్) నియోజకవర్గాలకు చెందిన 2550 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి, ఆర్డీవో శ్యామ్‌కుమార్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత తదితరులు పాల్గొన్నారు.

### పేదలు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

పేదలంతా బ్రాండ్ అంబాసిడర్లు కావాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు విజయవంతంగా ముందుకెళ్తున్నాయి. లక్షల విలువలతో కూడిన ఇండ్లను అర్హులకు అందించాం. సీఎం కేసీఆర్ హయాంలో ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న సుపరిపాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి.

-ఎమ్మెల్యే వివేకానంద్

### దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచింది

రెండు పడకల ఇండ్ల నిర్మాణ పథకంలో దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ నిలిచింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఎవరూ నిరుత్సాహపడవద్దు.

- ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



# ఇప్పటివరకు 61,596 ఇండ్లు

నిరుపేదల సొంతింటి కల సాకారం

- పైసా ఖర్చు లేకుండా.. పారదర్శకంగా గృహాల కేటాయింపు
- గురువారం కనుల పండువగా సాగిన డబుల్ ఇండ్ల పంపిణీ
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, డిప్యూటీ స్పీకర్
- లబ్ధిదారుల ఆనందబాష్పాలు.. సీఎం కేసీఆర్ చల్లగా ఉండాలని దీవెనలు

| | |
|---|---|
| మొదటి విడత | 11,700 |
| రెండో విడత | 13,200 |
| మూడో విడత (2న) | 19,020 |
| మూడో విడత (5న) | 17,676 |

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న తెలంగాణ సర్కారు.. మూడో విడతలో భాగంగా ఎంపికైన మరో 17,676 మంది లబ్ధిదారులకు గురువారం గృహాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమాలు గ్రేటర్‌వ్యాప్తంగా ఏడు చోట్ల కనుల పండువగా సాగాయి. మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితాఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, అరెకపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గృహాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటికే మొదటి విడతలో 11,700 మందికి, రెండో విడతలో 13,200 మందికి , మూడో విడతలో ( రెండు దశల్లో) 36,696 మంది లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించారు. మొత్తం 61,596 ఇండ్లను పేదలకు అందజేశారు. కాగా, గృహాలు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ చల్లంగా ఉండాలని దీవించారు. పేదల కష్టాలు తెలిసిన గొప్ప నేత సీఎం కేసీఆర్ అని.. బంగారం లాంటి ఇల్లు ఇచ్చి మాలాంటివాళ్లను లక్షాధికారులను చేశారని జగద్గిరిగుట్టకు చెందిన లబ్ధిదారు అక్తర్ బేగం పేర్కొంటే.. సంక్షేమం కావాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు మరో లబ్ధిదారు దుండిగల్‌కు చెందిన శివలక్ష్మి.

## ఒక్కో ఇంటి విలువ.. 50 లక్షలకు పైనే

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్
- రాంపల్లిలో లబ్ధిదారులకు గృహాల పంపిణీ

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 5 : దేశంలో ఎక్కడి లేని విధంగా తెలంగాణలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి 2845 డబుల్ బెడ్రూం ఇండ్లను ఉప్పల్, అంబర్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ రూ. 50 లక్షల విలువ చేసే డబుల్ బెడ్రూం ఇండ్లను పొందిన పేదలు అదృష్టవంతులని, ఇండ్లను ఎట్టి పరిస్థితుల్లో అమ్మవద్దని పద్మారావు కోరారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

### కిరాయి బాధలు తప్పాయి..

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదు. తెలంగాణలో మాత్రమే సీఎం కేసీఆర్ ఇండ్లను అందిస్తున్నారు. పేదలకు ప్రతి నెల కిరాయి తప్పింది. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 200 శాతం అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను అధిక ఓట్లతో గెలిపించి మరోసారి సీఎంను చేయాలి.

## చరిత్ర సృష్టించేలా ప్రతి అభివృద్ధి పథకం

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- మురహరిపల్లిలో డబుల్‌బెడ్రూం ఇండ్ల పంపిణీ

మేడ్చల్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ప్రతి అభివృద్ధి పథకం చరిత్ర సృష్టించే విధంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మురహరిపల్లిలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన 2,376 మంది లబ్ధిదారులకు ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్రూం ఇండ్ల బ్లాక్‌లను కేటాయించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు మేలు చేయాలని కృతనిశ్చయంతో అభివృద్ధి-సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే నంబర్‌వన్ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గంథ్రాలయ సంస్థ చైర్మన్ దర్గాదయాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బెస్తా వెంకటేశ్, జడ్పీటీసీ అనిత తదితరులు పాల్గొన్నారు.

### సొంతింటి కలను నిజం చేశారు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. అర్హులైన నిరుపేదలకు ఇండ్లు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.



లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

## పేదలకు దసరా కానుకగా డబుల్ ఇండ్లు

- కొల్లూరులో ఇండ్లను ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- 720 మంది లబ్ధిదారులకు పట్టాలు అందచేత



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పేదలకు దసరా కానుకగా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇచ్చారని, పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి స్వప్నం సాకారమైందని, ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గంలోని కొర్రెముల (వెంకటాపురం)లో 6 ఎకరాల్లో నిర్మించిన 800 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. లబ్ధిదారులపై ఒక్క రూపాయి భారం లేకుండా అన్ని రకాల సౌకర్యాలతో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఉచితంగానే ఇస్తున్నది దేశంలోని ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణే అని అన్నారు. సొంత ఇల్లు లేని పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలన్న సీఎం కేసీఆర్ సంకల్పంతోనే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఇండ్ల పంపిణీ కూడా ఎంతో పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ గీతా శ్రీనివాస్, ఎంపీటీసీ రామారావు, హౌసింగ్ కార్పొరేషన్ సీఈ సురేశ్, ఈఈ వెంకటదాసు రెడ్డి, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గేటెడ్ కమ్యూనిటీ స్థాయిలో డబుల్ బెడ్రూంలు

- పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి
- శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేలు గాంధీ, మాగంటి గోపీనాథ్



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, గాంధీ

రామచంద్రాపురం, అక్టోబర్ 5: పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు మద్దతు తెలిపి మరోసారి ఆశీర్వదించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికపూడి గాంధీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం కొల్లూర్‌లోని కేసీఆర్ టౌన్‌షిప్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, యాకుత్‌పుర నియోజకవర్గాలకు చెందిన 7,241 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అరికపూడి గాంధీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించారన్నారు. గేటెడ్ కమ్యూనిటీస్‌కు దీటుగా సకల సౌకర్యాలతో గృహాలు నిర్మించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జడ్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంగ్రంరెడ్డి, ఉప తహసీల్దార్ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి వసతులతో తెలంగాణ అభివృద్ధి

- బల్దియా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి
- తూంకుంటలో 1548 డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ



డబుల్ ఇండ్ల ప్రారంభోత్సవంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్

శామీర్‌పేట, అక్టోబర్ 5 : ప్రపంచ స్థాయి వసతులతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలో జీహెచ్ఎంసీ నిర్మించిన 1548 డబుల్ బెడ్రూం ఇండ్లను గురువారం ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రపంచ స్థాయి వసతులతో చేపడుతున్న ప్రతి కార్యక్రమం అత్యద్భుతమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రావూరి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ చంద్రవతి తదితరులు పాల్గొన్నారు.